- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
29-08-2026

సంపుటి : 01 సంచిక :158 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE158 NAMASTEY MAHAAPRABHA




# భయం భయంగా నేపాల్

- నేపాల్ వరద మృతుల సంఖ్య 584
- 3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం
- పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నదీ సరస్సులు
- హెచ్చరించిన చైనా పోలీసులు
- సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు
- చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి

03

## పొంచివున్న మరో ప్రళయం

నేపాల్‌ను ఇప్పటికే అతలాకుతలం చేసిన వరదల విషాదం ఇంకా ముగియకముందే మరో భారీ ప్రమాదం ముంచుకొస్తోంది. నేపాల్--టిబెట్ సరిహద్దు సమీపంలోని రెండు హిమానీనద సరస్సులు ప్రమాదకర స్థాయిలో పొంగిపొర్లుతుండటంతో దిగువ ప్రాంతాల్లో మరోసారి జలప్రళయం సంభవించే భయం నెలకొంది. వరదల్లో ఇప్పటివరకు 584 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 3,700 మందికిపైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ వందలాది మంది ఇంకా గల్లంతుగానే ఉన్నారు. భారతీయులు సహా యాత్రికులు, పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుండగా, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలను మరింత క్లిష్టంగా మారుస్తోంది. మరోవైపు వరద ప్రవాహాల్లో కొట్టుకొచ్చిన బంగారం, నగదు కోసం కొందరు దుర్మార్గులు మృతదేహాలనూ వదలకపోవడం ఈ విపత్తు మధ్య మానవత్వాన్ని ప్రశ్నించే ఘటనగా మారింది.



## తీవ్ర నేరాలు తగ్గాయి

- మూడేళ్లలో 7.15 శాతం నేరాల పెరుగుదల
- సమిష్టి కృషితో సైబర్ నేరాలకు చెక్
- రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడిపై ప్రత్యేక నజర్
- ఇకపై యూనిట్ల వారీగా సమీక్షలు
- క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలి
- అర్ధవార్షిక నేర సమీక్షలో డిజిపి సీవీ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్, :ఆగస్టు 28 ( మహాప్రభ )

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నేరాలు పెరిగినప్పటికీ, తీవ్రమైన నేరాలు తగ్గుముఖం పట్టినట్లు డిజిపి సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. డిజిపి కార్యాలయంలో శుక్రవారం నేరాలపై పోలీసు అధికారులతో డిజిపి అర్ధవార్షిక నేర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఐఎ, సీసీటీఎన్ఎస్, టీజీ శాప్, పోక్సో ది క్యాబినెట్, ఈగల్, ఐసీజేఎస్, కొత్త క్రిమినల్ చట్టాల అమలు సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేళ్లలో నేరాలు 7.15 శాతం పెరిగాయన్నారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా, 2025-26లో వీటి సంఖ్య 2,84,363కు పెరిగిందన్నారు. డ్రగ్స్ కేసులు 46.10 శాతం పెరిగాయని, 2,026 కేసుల నుండి 2,960కు చేరుకున్నాయన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్ కేసులు సైతం 25 నుంచి 451కి పెరిగాయన్నారు.

-మిగతా 3 లో

# గట్టిగా వాదించాలి


## అంతర్రాష్ట్ర జలవివాదాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

- మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జలవివాదాల్లో తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలి
- తుమ్మిడిహట్టి, సిడబ్ల్యూసి భేటీలో రాజీలేని వాణి వినిపించాలి
- ఇరిగేషన్ అధికారులతో సీఎం రేవంత్రెడ్డి
- జలవివాదాలకు సంబంధించిన వివిధ కేసులపై ఆరా తీసిన ముఖ్యమంత్రి



మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తో కొనసాగుతున్న జలవివాదాల్లో తెలంగాణ హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి రాజీ ఉండబోదన్న సంకేతాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఇచ్చినట్లు తెలుస్తోంది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, కృష్ణా--గోదావరి జలాల పంపిణీ, పెండింగ్ కేసులు వంటి అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. కేంద్ర జల సంఘం, కేఆర్ఎంబీ, న్యాయస్థానాల వేదికలపై తెలంగాణ వైఖరిని స్పష్టంగా, బలంగా వినిపించాలని ఆదేశించినట్లు సమాచారం. వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటాల కోసం గట్టిగా వాదించాలని, తాగు-సాగునీటి అవసరాల విషయంలో ఎలాంటి రాజీకి తావులేకుండా వ్యవహరించాలని అధికారులకు సూచించినట్లు తెలిసింది.

03



## చైనాలో భూకంపం

- రిక్టర్ స్కేలుపై 5.1 ని తీవ్రతతో నమోదు
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కిరప్పిస్తున్న అధికారులు

పెషావర్ : :ఆగస్టు 28 ( మహాప్రభ )

చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప ధాటికి చైనా, నేపాల్? సరిహద్దు? ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న

-మిగతా 3 లో



## నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక

- 'నెతన్యాహును నరకానికి పంపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు
- ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్
- అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు
- యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక


03

## హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

- వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు
- హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు
- ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు
- 1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం
- 200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన

నేపాల్‌ను వణికించిన ఆకస్మిక వరదల వెనుక వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హిందూ కుష్--హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి మరింత వేగంగా కరిగిపోతుండగా, ఒకప్పుడు మంచు కురిసే 7 వేల మీటర్లకు పైబడిన ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు కురుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హిమానీనదాల మంచు నష్టం రెట్టింపై, 1975 నుంచి వాటి మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఐసీఐఎంవోడీ నివేదికలు వెల్లడించాయి. ఆసియాకు 'జలస్తంభాలు'గా పేరొందిన ఈ పర్వత ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు భవిష్యత్తులో దాదాపు 200 కోట్ల మంది ప్రజల నీటి భద్రత, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

03



## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్



### క్యూఆర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా
- రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ
- పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్
- హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, :ఆగస్టు 28 ( మహాప్రభ )

హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూఆర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు

-మిగతా 3 లో

## ప్రజాపాలనా? పోలీస్ పాలనా?

- ప్రశ్నిస్తే కేసులు.. నిరసన తెలుపితే అరెస్టులా?
- రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల జులుంపై హరీశ్‌రావు ఆగ్రహం
- ప్రజాపాలన ముసుగులో అరాచక పాలన నడుస్తోందని విమర్శ
- వివిధ ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ధ్వజం



హైదరాబాద్, :ఆగస్టు 28 ( మహాప్రభ )

'రాష్ట్రంలో ఉన్నది ప్రజాపాలనా? పోలీస్ పాలనా? ఊరూరా పోలీసులు జులుం ప్రదర్శిస్తున్నారు. రేవంత్‌రెడ్డీ.. ఇదేనా మీరు తెచ్చిన మార్పు' అని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. మొన్న మహబూబాబాద్‌లో ఓ పోలీస్ అధికారి పాలిటెక్నిక్ విద్యార్థి గొంతుపిసికి క్రూరంగా ప్రవర్తించాడని తెలిపారు. నిన్న నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేటలో తన కుమార్తెకు జరిగిన అవమానంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన వ్యక్తిని పోలీసులు బూటుకాళ్లతో తన్ని, మూత్రం తాగించినట్టు ఆరోపణలొచ్చాయని పేర్కొన్నారు. తాజాగా సూర్యాపేటలో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడని పోలీసులు కేసులు పెట్టి బడ్డీ కొట్టు

-మిగతా 3 లో

# సాయం వద్దు.. ఆర్థిక సహకారం చాలు

--విదేశాలకు నేపాల్ విజ్ఞప్తి



**కాఠ్మాండు, ఆగస్టు 28 ( మహాప్రభ )**
జలప్రళయంతో అతలాకుతలమైన నేపాల్‌లో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఈ పరిస్థితుల్లో బాధితులకు సహాయక చర్యలు అందించడం అత్యంత అవసరం. దీంతో తాము నేపాల్‌కు సహాయం చేస్తామంటూ భారత్, చైనా సహా పలు ప్రపంచ దేశాలు ముందుకు వచ్చాయి. అయితే మీ సహాయం మాకు అవసరం లేదంటూ నేపాల్ తిరస్కరిస్తున్నది. విదేశాల సహాయం అవసరం లేదని స్పష్టం చేసింది. అయితే తమకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసింది.

**విషాదంలోనూ అమానవీయం**
మెరుపు వరదలతో తీవ్ర విషాదం నెలకొన్న నేపాల్‌లో కొందరు అమానవీయంగా చేతివాటం ప్రదర్శిస్తూ మృతదేహాల నుంచి బంగారం, విలువైన ఆభరణాలు అపహరిస్తున్నారు. దీని వీడియో వెలుగులోకి వచ్చింది. నరయాణి నదిలో కొట్టుకుపోతున్న ఒక మహిళ మృతదేహాన్ని కొందరు యువకులు కర్రలతో ఒడ్డుకు లాగి, ఆమె చెవిపోగులు తీసుకుని శవాన్ని తిరిగి నీటిలో వదిలేశారు. సోషల్ మీడియాయే దిక్కు నేపాల్‌లో వరద విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్న భారతీయులు తమ వారికి సమాచారం అందించే కమ్యూనికేషన్ వ్యవస్థ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫోన్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడంతో వారు సామాజిక మాధ్యమాల ద్వారా వీడియోలు, క్లిప్‌లను పంపుతూ క్షేమసమాచారాన్ని తెలియజేస్తున్నారు.


# పేపర్ కప్పులో వేడి ద్రవాలు డేంజర్!

-ప్లాస్టిక్ పూతతో అనారోగ్యం
-క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ అధ్యయనం హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 ( మహాప్రభ )**
సింగిల్ యూజ్ పేపర్ కప్పుల్లో కాఫీ, టీలాంటి వేడి ద్రవాలు పోసినప్పుడు లక్షలాది మైక్రోప్లాస్టిక్ కణాలు విడుదలవుతాయని ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్ అధ్యయనం వెల్లడించింది. విశ్వవిద్యాలయానికి చెందిన 'క్వీన్స్‌లాండ్ అలయన్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్' బృందం శిలాజ ఆధారిత పాలిథిన్(పీఈ) పూత పూసిన కప్పులు, అలాగే పాలీలాక్టిక్ యాసిడ్(పీఎల్ఏ) పూత పూసిన కప్పులపై అధ్యయనం చేసింది. ఈ రెండు రకాల కప్పులు ప్లాస్టిక్ కణాలను విడుదల చేస్తున్నట్లు తేలిందని, అయితే పీఎల్ఏ లేదా బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ పూత కలిగిన కప్పులు 12 రెట్లు ఎక్కువ కణాలను విడుదల చేశాయని డాక్టర్ ఎల్విస్ ఒకోఫో తెలిపారు. కప్పు కాగితంతో తయారైనంత మాత్రాన అది ప్లాస్టిక్ రహితమని అర్థం కాదు. ఎందుకంటే నీటి నిరోధకతను, నిర్మాణ స్థిరత్వాన్ని అందిండానికి చాలా కప్పుల్లో సన్నని ప్లాస్టిక్ పూత ఉంటుందని అన్నారు. దీని అర్థం పేపర్ కప్పుల వాడకాన్ని ఆపేయాలని కాదని, వాటి లోపలి పూతకు ఉపయోగించే పదార్థాల గురించి వినియోగదారులకు సమాచారం అందించాలనేదే తమ ఉద్దేశమని డాక్టర్ ఒకోఫో అన్నారు. ఈ అధ్యయనం 'ఏసీఎస్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యింది.

# ఏఐ సాయంతో మెదడు సర్జరీ



**లండన్ న్యూఢిల్లీ, ఆగస్టు 28 ( మహాప్రభ )**
తొలి ఏఐ ఆధారిత మెదడు శస్త్రచికిత్స విజయవంతంగా లండన్‌లో పూర్తి చేశారు. యూకేకు చెందిన హిబర్ట్ (48) బ్రెయిన్‌లో చిన్న సైజులో ట్యూమర్ ఏర్పడింది. కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉండటంతో డాక్టర్లు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఈ ట్యూమర్ తొలగించే సమయంలో దగ్గర్లోని రక్తనాళాలు, నరాలకు నష్టం కలిగే ప్రమాదం ఉంది.దీంతో డాక్టర్లు ఏఐతో శస్త్రచికిత్స చేయాలనుకున్నారు. లైవ్ వీడియో ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన ఏఐ టూల్ వైద్యులు ఏ మార్గంలో వెళ్లాలో సూచనలు చేసింది. ఎండోస్కోప్ కెమెరా ద్వారా ఏఐ టూల్ సున్నితమైన నరాలు లేని మార్గాన్ని సూచించింది. వాటిని విశ్లేషించుకుని డాక్టర్లు శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.

# యూఎస్ పోస్టల్ సర్వీస్‌కు షాక్

మెయిల్ ఓటింగ్ ప్రణాళిక అమలుకు బ్రేక్




**బోస్టన్ :ఆగస్టు 28 ( మహాప్రభ )**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేస్తున్న కార్యనిర్వాహక ఉత్తర్వులకు న్యాయస్థానాలలో చుక్కెదురు అవుతూనే ఉంది. మెయిల్ ఓటింగును పరిమితం చేస్తూ ఆయన జారీ చేసిన ఉత్తర్వును రెండు వారాల పాటు అమలు చేయకుండా యూఎస్ పోస్టల్ సర్వీసును (యూఎస్‌పీఎస్) బోస్టన్‌లోని ఫెడరల్ జడ్జి నిలువరించారు యూఎస్‌పీఎస్ నిబంధనల అమలును డెమొక్రటిక్ పాలిత రాష్ట్రాలు, ఓటర్ అడ్వొకసీ గ్రూపులు న్యాయస్థానంలో సవాలు చేశాయి. పిటిషన్లపై విచారణ జరిపిన అనంతరం యూఎస్‌పీఎస్ నిబంధన అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ బోస్టన్ న్యాయమూర్తి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. నిబంధన రాజ్యాంగ విరుద్ధమని, దీనిని జారీ చేసే అధికారం యూఎస్‌పీఎస్‌కు లేదని పిటిషనర్లు చేస్తున్న వాదనకు అంతిమంగా విజయం చేకూరే అవకాశం ఉన్నదని న్యాయమూర్తి ఇందిరా తల్వానీ చెప్పారు. నిబంధనలపై ప్రాథమిక ఇంజక్షన్ ఆదేశాలు ఇవ్వాలా వద్దా అనే అంశంపై వచ్చే గురువారం ఆమె విచారణ జరుపుతారు.

# చైనా యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తున్న బంగ్లాదేశ్



ఢాకా :ఆగస్టు 28 ( మహాప్రభ )
చైనా నుంచి 2.3 బిలియన్ డాలర్ల విలువైన ఇరవై జే -- 19 సీఈ బహుళ ప్రయోజక యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని బంగ్లాదేశ్ భావిస్తోంది. బంగ్లాదేశ్ జరిపిన అతి పెద్ద రక్షణ కొనుగోళ్లలో ఇది కూడా ఒకటి కాబోతోంది. గత సంవత్సరం ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనాకు చెందిన జే- 10 విమానాల పనితీరును గమనించిన బంగ్లాదేశ్ ఈ నిర్ణయానికి వచ్చింది. బంగ్లాదేశ్ వైమానిక దళాన్ని ఆధునీకరిం చాలని తారిఖ్ రెహమాన్ ప్రభుత్వం అనుకుం టోంది. మూల ధర 62.7 మిలియన్ డాలర్ల కంటే చాలా ఎక్కువగా ఒక్కో యుద్ధ విమానం కొనుగోలుకు సుమారు 115 మిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రతిపా దించింది. అదనపు వ్యయంలో శిక్షణ, పరికరాలు, సాంకేతిక- లాజిస్టిక్ మద్దతు, రవాణా, బీమా, వ్యాట్, నిర్మాణ పనులు కలిసి ఉంటాయి. కాగా చైనా నుంచి యుద్ధ విమానా లను కొనుగోలు చేస్తున్న సమాచారాన్ని బంగ్లాదేశ్ ప్రధాని సమాచార, ప్రసార సలహాదారు జాహెద్ ఉర్ రెహమాన్ ధృవీకరించారు.

# విద్యార్థులపై ప్రాణాంతక బల ప్రయోగం!

-ఢిల్లీ, బీహార్ నిరసనలపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక
-పోలీసు చర్యలపై కొరవడిన జవాబుదారీతనం



**న్యూఢిల్లీ:ఆగస్టు 28 ( మహాప్రభ )**
ఢిల్లీలో జెన్-జీ జూలైలో చేపట్టిన నిరసనలపై పోలీసుల స్పందనను డాక్యుమెంట్ చేస్తూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఒక డిజిటల్ విచారణ నివేదికను ప్రచురించింది. ఆగస్టు 24న ప్రచురించిన ఈ విచారణ నివేదికలో.. భారత పోలీసులు శాంతియుత నిరసనకారులపై చట్టవిరుద్ధమైన, ప్రాణాంతకమైన బలాన్ని ప్రయోగించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ 'ఎవిడెన్స్ ల్యాబ్' వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఢిల్లీ, బిహార్‌లోని సీవాన్‌లో నిరసనకారులపై పోలీసులు పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్, గ్రెనేడ్లు, లాఠీలు, ఎలక్ట్రిక్ షాక్ పరికరాలు వంటి ఆయుధాలను ఉపయోగించినట్టు స్పష్టం చేసింది.బలప్రయోగం ద్వారా నిరసనలను అణచివేయడానికి భారత అధికారులు యత్నించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా బోర్డు చైర్‌పర్సన్ ఆకార్ పటేల్ ఆరోపించారు. ఈ రకమైన తీవ్రమైన స్పందన అనేది శాంతిభద్రతల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం చేసిన హింసగా తెలిపారు. నెలరోజులు గడిచినా ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనం అని ఆయన అన్నారు. పెల్లెట్ గాయాలపాలైన ఒక నిరసనకారుడు మాట్లాడుతూ.. ఆర్ఏఎఫ్ సిబ్బంది మొదట టియర్ గ్యాస్ ఉపయోగించారని, తర్వాత పెల్లెట్ తుపాకులను ప్రయోగించారని ఆరోపించాడు. అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా వెనుకభాగంలో గుండ్లు దిగాయని, దాదాపు 25 నుంచి 30 పెల్లెట్ గాయాలయ్యాయని పేర్కొన్నాడు. ఆ గాయాలు పెల్లెట్ల వల్లే అయ్యాయని హాస్పిటల్‌లోని వైద్యులు ధ్రువీకరించారని తెలిపాడు. ఢిల్లీ పోలీస్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది నిరసనకారులను లాఠీలతో కొడుతున్న ఎనిమిది వీడియోలను కూడా అమ్నెస్టీ ధ్రువీకరించింది. ప్రత్యక్షంగా ఎలాంటి ముప్పు కలిగించనివారిని, ఒక చిన్న బాలుడిని అధికారులు కొడుతున్న దృశ్యాలు ఆ ఫుటేజీలో ఉన్నాయి. కొన్ని వీడియోలలో సాధారణ దుస్తులతో ఉన్న వ్యక్తులు నిరసనకారులను లాఠీలతో కొడుతూ కనిపించారు. ఈ ఆధారాలు నిరసనకారులపై బలప్రయోగం, పోలీసు చర్యలకు జవాబుదారీతనం లేకపోవడంపై మళ్లీ ప్రశ్నలను రేకెత్తించాయి.

# పాకిస్తాన్ ఐఎస్ఐ కోసం పని చేస్తున్న భారతీయ జంట..



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 ( మహాప్రభ )**
పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్న దంపతుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పోలీసులు కీలక వివరాలు రాబట్టారు. అరెస్టైన జంటను మొహమ్మద్ సాహిల్, అతడి భార్య సమీరగా గుర్తించారు. వీరి అరెస్టుకు సంబంధించిన వివరాల్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. సాహిల్, సమీర జంట ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలో ఉంటున్నారు. సాహిల్ 2001లో ఉత్తర ప్రదేశ్‌లోని బదాయున్ ప్రాంతానికి చెందినవాడు.అతడు త్వరలో ఎల్ఎల్‌బీ చదివేందుకు ప్లాన్ చేసుకున్నాడు. 2005లో బిజ్నూర్‌కు చెందిన సమీర ఇంటర్ పూర్తి చేసింది. వీరిద్దరూ కొంతకాలంగా పాకిస్తాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) సంస్థతో కలిసి పని చేస్తున్నారు. భారతీయ నిఘా వ్యవస్తలు అందించిన సమాచారం ఆధారంగా నార్తర్న్ రేంజ్ ఆఫ్ ద స్పెషల్ సెల్ పోలీసులు ఈ దంపతుల్ని అరెస్టు చేశారు. సాహిల్ 2024 నుంచి పాకిస్తాన్ కోసం పనిచేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అక్కడి వారిని సంప్రదిస్తుంటాడు. అతడితోపాటు భార్య సమీర కూడా పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తుంటుంది. ఈ ఇద్దరికీ తగిన ఆర్థిక సాయం అందిస్తామని పాక్ ఏజెంట్లు హామీ ఇవ్వడంతో ఇద్దరూ గూఢచర్యం చేస్తున్నారు. పాక్ వారికి అనుకూలంగా ఉండేవారిని ఇంకా సభ్యులుగా చేర్పించడం, అలాగే వారికి రవాణ సదుపాయం చేయడం వంటి పనుల్ని పాక్ ఐఎస్ఐ అప్పగించింది. ఈ జంట ఇక్కడ ఎనిమిది సిమ్ కార్డులు కొని, దుబాయ్ ద్వారా పాకిస్తాన్ పంపింది. ఈ సిమ్ కార్డులకుగాను వారికి రూ.30,000 అందాయి. ఈ ఇండియా నెంబర్లను పాకిస్తాన్ నుంచి ఆపరేట్ చేస్తున్నారు.వీటికి సంబంధించిన వాట్సాప్ కూడా యాక్టివేట్ అయింది. ఈ నెంబర్ల ద్వారా నిఘా సంబంధిత కార్యకలాపాలు చేపడుతున్నారు. ఇండియన్ నెంబర్లతో పాకిస్తాన్ వాళ్లు అనేక ఇండియన్ వాట్సాప్ గ్రూపుల్లోకి ఎంటర్ అయ్యారు. ఇండియాలోని కంటోన్మెంట్ ప్రాంతాల్లో ఈ జంట పర్యటించి, అక్కడి సమాచారాన్ని కూడా వారికి చేరవేసింది. ఈ దంపతులకు సంబంధించిన ఫోన్లను పోలీసులు సీజ్ చేశారు. ప్రస్తుతం వీరికి సంబంధించిన విచారణ కొనసాగుతోంది.

# పరీక్షల్లో సంస్కరణలపై సూచనలివ్వండి.

- విద్యార్థులు, తల్లిదండ్రులను కోరిన టాస్క్‌ఫోర్స్



**న్యూఢిల్లీ, ఆగస్టు 28 ( మహాప్రభ )**
ప్రభుత్వం నిర్వహించే వివిధ రకాల పరీక్షలకు సంబంధించి సంస్కరణలపై సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ కోరింది. ప్రభుత్వ పరీక్షల నిర్వహణ, భద్రత, మూల్యాంకన పద్ధతి తదితర అంశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇతర సంస్థల నుంచి వీటిని ఆహ్వానిస్తున్నది. ఇంగ్లిష్, హిందీ, ప్రాంతీయ భాషల్లో సెప్టెంబర్ 13లోగా వాటిని టాస్క్‌ఫోర్స్‌కు సమర్పించాలని కేంద్రం తాజాగా ఒక ప్రకటన జారీ చేసింది.నీట్ పేపర్ లీక్ అనంతరం ఎన్‌టీఏ సహా వివిధ రకాల ప్రభుత్వ పరీక్షల్లో సంస్కరణలపై కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. పటిష్ఠమైన, సురక్షితమైన, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయటమే లక్ష్యంగా టాస్క్‌ఫోర్స్ కమి టీ పనిచేయనున్నదని కేంద్రం తెలిపింది.

# చైనాలో భూకంపం


మొదటి తరువాయి

భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు ఇంచీ నివేదించింది. మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరగివస్తున్నాయని చెప్పారు. నేపాల్‌కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్–చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు. ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్? సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మ రాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్? బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్ల?తో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కార్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్? ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

## హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

**వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు**
**హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు**
**ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు**
**1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం**
**200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన**



న్యూఢిల్లీ,
ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి హిందూ కుష్ హిమాలయ(హెచ్‌కేహెచ్) అంతటా విస్తరించి ఉన్న హిమానీనదాలు మరింత వేగంగా కరిగిపోతున్నాయని, మంచు నష్టం పరిమాణం రెట్టింపు అయ్యిందని హెచ్‌కేహెచ్ ప్రజల తరఫున పనిచేస్తున్న ఒక అంతర్ ప్రభుత్వ విజ్ఞాన, అధ్యయన కేంద్రం ఐదు నెలల క్రితం వెలువరించిన రెండు నివేదికలు వెల్లడించాయి. 1975 నుంచి హిమానీ నదాల మంచు మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఈ నివేదికలు పేర్కొన్నాయి. కాఠ్మాండు కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్(ఐసీఐఎంఓడీ) ఈ నివేదికలను విడుదల చేసింది. ఆసియా జలస్తంభాలు అని పిలిచే ప్రాంతాల్లో నీటిపై ఆధారపడి జీవిస్తున్న దిగువ ఉన్న దాదాపు 200 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తులో ఒక ఆందోళనకరమైన పరిస్థితి ఎదురవుతుందని ఆ నివేదికలు హెచ్చరించాయి. రెండు రోజుల క్రితం వందల మంది ప్రాణాలను బలిగొన్న నేపాల్ ఆకస్మిక వరదలకు అసలు కారణం ఏమిటనే దానిపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు దర్యాప్తు చేస్తుండగా వారిలో చాలామంది అనేక అంశాల కలయికే దీనికి కారణమని భావిస్తున్నారు. అయితే అందులో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే 7వేల మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో మంచు కురవడానికి బదులుగా వర్షం కురవడం. ఒకప్పుడు హిమపాతం నమోదైన ఎత్తైన ప్రాంతాలలో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయని, అలాగే హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నాయని, దీనికి కారణం వాతావరణం వేడెక్కడమేనని శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

## నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక



**-"నెతన్యాహును నరకానికి పంపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు**
**-ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్**
**-అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు**
**-యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక**

న్యూఢిల్లీ,
ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక జారీ చేసింది. తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించింది. ఇదే సమయంలో ఇకపై తమ యుద్ధం కొత్త విధానంలో ఉంటుందని ఇరాన్ తెలిపింది. తమ నౌకా మార్గాన్ని బ్లాక్ చేసిన అమెరికాకు కూడా ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటరీ మేజర్ జనరల్ మోషెన్ రెజాయే తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్, అమెరికాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు బ్యారోన్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారు అంటూ నేరుగా ట్రంప్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఇదంతా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇచ్చిన తప్పుడు సమాచారం అన్నారు. అయితే, తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించారు. నెతన్యాహు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు జియోనిస్ట్ పాలనకు ముగింపు పలకబోతుందనే విషయాన్ని తాము నిరూపిస్తామని వివరించారు. ట్రంప్ కుమారుడిని చంపాలనుకుంటున్నట్లు నెతన్యాహు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా ట్రంప్‌ను ఆందోళనకు గురయ్యేలా చేశారని, దీంతో ట్రంప్ ఒక ఫుడ్ ట్రక్ వర్కర్‌లాగా మారాల్సి వచ్చిందిన మోషెన్ వ్యాఖ్యానించారు.

## ప్రజాపాలనా? పోలీస్ పాలనా?

మొదటి తరువాయి

తొలగించారని, నిరసన తెలిపిన వారిపై కోదాడ సీఐ దౌర్జన్యం చేశాడని ఎక్స్ వేదికగా వివరించారు. ప్రజాపాలన ముసుగులో రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని ధ్వజమెత్తారు. సూర్యాపేటలో పోలీసుల దౌర్జన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాసమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్షాలు, రైతులు, విద్యార్థులపై పోలీసులతో జులుం చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, నిరసన తెలిపిన వారి అరెస్టులు, హక్కులు అడిగిన వారిపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మీరు చెప్పుకొంటున్న ఇందిరమ్మ పాలన? ఇదేనా అని నిలదీశారు. ఇప్పటికైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చొరవ తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు

# భయం భయంగా నేపాల్...

**-పొంచివున్న మరో ప్రళయం**
**--నేపాల్ వరద మృతుల సంఖ్య 584**
**-3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**-ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం**
**-పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నదీ సరస్సులు**
**-హెచ్చరించిన చైనా పోలీసులు**
**-సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు**
**-చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి**

ఖాట్మండ్:
నేపాల్ ఇంకా భయం గుప్పిట్లోనే ఉంది. ఇప్పటికే వరద విధ్వంసంతో చిగురుటాకులా వణికిన నేపాల్ మరో ముప్పును ఎదుర్కోబోతోంది. నేపాల్–టిబెట్ సరిహద్దుల సమీపంలోని గాలింగ్ సరిహద్దు ప్రాంతం ఎగువన హిమానీనదం కరిగిపోవడంతో ఏర్పడిన సమాజ సరస్సులు రెండు ఇప్పుడు పొంగిపొర్లుతున్నాయి. నదిస్సు నుండి నీరు గట్టును దాటి బయటకు వస్తున్నట్లు చైనీస్ మీడియా శుక్రవారం వెల్లడించింది. సరస్సు నుంచి భారీగా నీరు బయటకు వస్తుండటంతో దిగువ ప్రాంతాల్లోని నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. నదీ పరివాహక ప్రాంతాలకు భారీ వరద ముప్పు ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి తెగిపోతే మరోసారి భారీ వరదలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం చైనా ప్రభుత్వం కొంతసేపు సహాయక చర్యలను నిలిపివేసింది. అనంతరం డ్రోన్లు, శాటిలైట్లు, శాటిలైట్ ఛాయాచిత్రాల ద్వారా పరిస్థితిని పరిశీలించిన తర్వాత ప్రమాద స్థాయి కొంత తగ్గిందన అంచనా వేసి మళ్లీ సహాయక చర్యలను ప్రారంభించింది. అయినప్పటికీ ప్రాంతంలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం కొనసాగుతుండటంతో సహాయక బృందాలు అత్యంత అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్‌లో 584 మంది మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. చైనా వైపున మరో




ఐదుగురు మృతి చెందడంతో మొత్తం మృతుల సంఖ్య 552కు చేరింది. ఈ వరదల్లో నేపాల్ పర్యాటక బోర్డు సహాయంతో 117 మంది పర్యాటకులను సురక్షితంగా రక్షించగా, వీరిలో 85 మంది భారతీయులు ఉండగా.. చైనా, దక్షిణ కొరియా, అమెరికా, ఇటలీ తదితర దేశాలకు చెందిన పర్యాటకులు కూడా ఉన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, చైనా వైపున చిక్కుకుపోయిన 98 మంది భారతీయులు కూడా సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారు. వందలాది మంది భారతీయులు సహా మొత్తం 1,400 మందికి పైగా ఇప్పటికీ గల్లంతైనట్లు సమాచారం. భారత ప్రభుత్వ అంచనా ప్రకారం కనీసం 320 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. గల్లంతైన వారిలో పర్యాటకులు, కైలాస్ మానస సరోవర్ యాత్రికులు, స్థానికులు, సహాయ సిబ్బంది ఉన్నారు. రెడ్ క్రాస్ అంచనా ప్రకారం ఈ విపత్తు వల్ల 90 వేల మందికిపైగా ప్రజలు ప్రభావితమ య్యారు. ఇప్పటివరకు 3,700 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇంకా 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు ఖాట్మండ్‌లోని వరద ప్రభావిత ప్రాంతం నుండి 21 మంది భారతీయులు నిన్న సురక్షితంగా చేరుకున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న మరో 63 మంది భారతీయులను గురువారం రక్షించారు. చైనా వైపు చిక్కుకుపోయిన మరో 98 మంది భారతీయులు సురక్షితంగా భూమార్గం ద్వారా నేపాల్‌లోకి ప్రవేశించాలని తెలిపినట్లు రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇంకా దాదాపు 320 మంది భారతీయులు, 100 మంది భారతీయ మూలాలున్న వ్యక్తుల ఆచూకీ కనుగొనలేకపోతున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల నుండి తరలించిన భారతీయ పర్యాటకులను నేపాల్‌లో భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ శుక్రవారం కలుసుకున్నారు.

కొట్టుకొచ్చిన బంగారం, వెండి కప్‌బోర్డ్
అనేక ప్రాంతాల్లో జనాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డారు. ఇలాంటి విపత్తు సమయంలో విపరీతమైన ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో డబ్బుతో పాటు బంగారం నీటి ప్రవాహంలో కొట్టుకువచ్చాయి. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఓ మహిళ మృతదేహం నుంచి కొందరు ఆభరణాలను దొంగిలించిన దారుణ ఘటన వెలుగు చూసింది. నారాయణి నది ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓ మృతదేహం నుండి కొందరు దొంగలు బంగారు నగలను దొంగిలించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన ఇద్దరు వ్యక్తులను నేపాల్ పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. మరోవైపు త్రిశూలి నది వరద ఉధృతికి బంగారు, వెండి ఆభరణాలు ఉన్న కప్‌బోర్డు ఒకటి కొట్టుకొచ్చింది. స్థానికులు దానిని తెరిచి చూడగా.. అందులో పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు కనిపించింది. 'జై శ్రీ మహాలక్ష్మి గోల్డ్ అండ్ సిల్వర్ షాప్' అని రాసి ఉన్న బిల్లు కూడా ఇదే అల్మారాలో లభించింది.

# తీవ్ర నేరాలు తగ్గాయి

మొదటి తరువాయి

ట్రాఫిక్ నేరాల్లో 9.48 శాతం పెరుగుదల నమోదైందని, అయితే సైబర్ క్రైమ్ రేటు 13.29కి, ఆర్థిక నేరాలు 13.28కి, తీవ్ర నేరాలు 10.33కి తగ్గాయన్నారు. హైదరాబాద్ నగరంలో తీవ్రమైన నేరాలు 26.23 శాతం తగ్గుముఖం పట్టగా డ్రగ్స్ కేసులు మాత్రం 90.98 శాతం మేరకు పెరిగాయని చెప్పారు.

7.15 శాతం పెరిగిన నేరాలు
రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగిందని డిజిపి వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదు కాగా.. 2025-26లో 2,84,363కు చేరాయన్నారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని, ముఖ్యంగా మాదక ద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని తెలిపారు. రాష్ట్ర పోలీసులు ఇకపై నెలవారీ క్రైమ్ రివ్యూలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అయితే క్రైమ్ రివ్యూలు కేవలం గణాంకాలకే పరిమితం కాకూడదని డిజిపి పేర్కొన్నారు. నేరాల కారణాలు, పని విధానం, దర్యాప్తు నాణ్యత, కేసుల పరిష్కారంపై విశ్లేషణ చేయాలన్నారు. ఫీల్డ్ లెవల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

సైబర్, ఆర్థిక నేరాల్లో ఊరట
సైబర్ నేరాలు 2024-25తో పోలిస్తే 2025-26లో 13.29 శాతం తగ్గాయని, ఆర్థిక నేరాల్లోనూ 13.28 శాతం తగ్గుదల నమోదైందని డిజిపి తెలిపారు. ఈ రెండు విభాగాల్లో మూడేళ్ల కాలానికి తగ్గుదల కనిపించడం సానుకూల పరిణామంగా పోలీస్ శాఖ భావిస్తోందన్నారు. సమీక్షలో డిజి మహేష్‌భగవత్, సీఐడీ డైరెక్టర్ షికా గోయెల్, ఉమెన్స్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ వారు స్నిగ్ధా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గట్టిగా వాదించాలి

**-అంతర్రాష్ట్ర జలవివాదాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి**
**-మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జలవివాదాల్లో తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలి**
**-తుమ్మిడిహట్టి, సిడబ్ల్యూసి భేటీలో రాజీలేని వాణి వినిపించాలి**
**- ఇరిగేషన్ అధికారులతో సీఎం రేవంత్రెడ్డి**
**- జలవివాదాలకు సంబంధించిన వివిధ కేసులపైద ఆరా తీసిన ముఖ్యమంత్రి**

హైదరాబాద్
రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా అంతర్రాష్ట్ర జల వివాదాలపై గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. సెప్టెంబర్ 01వ తేదీన తుమ్మిడిహట్టిపై ఢిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబర్ 7వ తేదీన సిడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశం ఎజెండాల గురించి అధికారులతో సీఎం రేవంత్రెడ్డి చర్చించినట్లుగా సమాచారం. ఎంసిఆర్హెచ్ఆర్డీలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్రెడ్డి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహారాష్ట్ర, ఏపీతో ఉన్న జల వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టంగా వినిపించాలని సీఎం రేవంత్రెడ్డి ఈ సందర్భంగా అధికారులకు సూచించినట్లుగా సమాచారం. దీంతోపాటు సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం, కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసుల గురించి ముఖ్యమంత్రి ఆరా తీసినట్టుగా తెలిసింది. ఆ కేసులు ఏ దశలో ఉన్నాయి, ఇతర రాష్ట్రాల వాదనలు ఎలా ఉన్నాయి, తెలంగాణ ప్రయోజనాలపై ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలపై సీఎం ఆరా తీసినట్లుగా సమాచారం. దీంతోపాటు సెప్టెంబర్ 04వ తేదీన జరిగే కెఆర్ఎంబీ తదుపరి సమావేశంలోనూ రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా తమ వాదనలు వినిపించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన వర్షపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగు, సాగునీటి విషయంలో రాజీ పడొద్దని మనకు దక్కాల్సిన నీటి వాటాలను మనం రాబట్టుకునేలా వాదనలు ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. మహారాష్ట్రతో తుమ్మిడిహట్టి అంతర్రాష్ట్ర సమస్యకు పరిష్కారం చూపే దిశగా సెప్టెంబర్ 07వ తేదీన సీడబ్ల్యూసీ నేతృత్వంలో ఏపి తెలంగాణ జలా వివాదాలపై కీలక భేటీ జరగనుంది. కృష్ణా జలాల వాటి, నీటి విడుదలపై ఏపి తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ, నీటి పంపకాలపై కెఆర్ఎంబీ పరిధిలో పెండింగ్ అంశాలపై సీఎం అధికారులతో చర్చించినట్లుగా తెలిసింది. దీంతోపాటు గోదావరి జలాల వినియోగం, ప్రాజెక్టుల అనుమతులకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య ఉన్న వివాదాలపై చర్చించినట్లుగా సమాచారం.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

మొదటి తరువాయి

అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి పరిధికి సంబంధించి లక్కీగూడలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిన్నటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూఆర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్‌లో కలుపు మొక్కలు

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటు కొత్తేమీ కాదు.. ఇవే మొదలు కాదు..ఇవే చివరికి కూడా కావు. అధికారం ఉంటే ఒక రకమైన కొట్లాట ఉంటుంది. లేకుంటే మరో రకమైన కొట్లాట ఉంటుంది. ఇవన్నీ కూడా ఆధిపత్యపోరులో భాగమే. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరంటే ఒకరికి గిట్టదు. ప్రజల పేరు చెప్పి, పథకాల పేరు చెప్పి డంబాచారాలు ప్రచారం చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఏ ఒక్కరు కూడా సమయం వెచ్చించి ప్రజా సమస్యలపై మాట్లాడరు. తాజా పరిణామాలను పరిశీలిస్తే...రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఇప్పుడున్న కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోవడం లేదన్నది ముమ్మాటికి నిజం. రేవంత్ టిడిపి నుంచి కాంగ్రెస్‌లోకి రావడం అన్నదే వారు చూసారు తప్ప కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకుని వచ్చారన్న నిజాన్ని పట్టించుకోరు. అందుకే అడపాదడపా వారు నోరు పారేసుకుంటారు. మేమున్నామని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంటారు. మంత్రిగా కొండా సురేఖ పెద్దగా పొడించిందేమీ లేదు. దేవాదాయశాఖలో ఎన్ని గుళ్లుల ఉన్నాయో, ఎంతమంది పూజారులు ఉన్నారో, ఎలాంటి పూజాదిక వ్యవస్థ మనదగ్గర ఉందో ఆమెకు తెలియదు. బ్రోచర్లు విడుదల చేయడం, బోనాలెత్తడం తప్ప ఈ మూడేళ్లలో ఆమె చేసింది శూన్యం. దేవాలయాలు కునారిల్లుతున్నాయి. ధూపదీప నైవేద్యాలు అందడం లేదు. అన్యాక్రాంతం అయిన భూముల్లో ఇంచు భూమి కూడా ఆమె వెనక్కి తీసుకోలేదు. గ్రామాల్లో దేవాలయాల భూములు వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి, కొందరు ఏకంగా పట్టాలు చేసుకున్నారు. ఉమ్మడి వరగంల్ జిల్లాలోనే ఇలా వందలాది ఎకరాలు ఉంటాయి. జనగామ జిల్లా బచ్చన్నపేట చెన్నకేశవస్వామి దేవాలయ భూములు కౌలు చేస్తున్నవారే పట్టాలు చేయించుకున్నారు. జీడికల్ భూములు, కొండాపూరం భూములు, ఇలా చెప్పుకుంటూ పోతే ఊరికో చరిత్ర ఉంది. ఆమె ఏనాడూ ఈ భూముల గురించి మాట్లాడడం లేదు. అటవీ శాఖ మంత్రిగా అసలు ఒక్క మొక్కయినా నాటి పెంచారా అన్న అనుమానం కలుగుతుంది. ఎపిలో పవన్ కళ్యాణ్ సామాజిక వనాల పెంపునకు పాల్పడుతుంటే ఇక్కడ కనీసం వరమహోత్సవాలు లేవు. ఉన్నా మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇవన్నీ వదిలేసి కూతురుతో సిఎం రేవంత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయించి, తనకేమీ సంబంధం లేదన్నట్లుగా మాట్లాడడం వారికే చెల్లింది. నిజానికి ఆమె దేవాలయాలను పట్టించుకుని, అడవులను పట్టించుకుని ఉంటే జనం ఆమె అంటే అభిమానం చూపేవారు. కానీ కూతరు రాజకీయం ముఖ్యం. రాజకీయాలు తప్ప ప్రజల సేవ ముఖ్యం కాదు. ఇక చిన్నరెడ్డి కూడా అంతే. ప్రణాళికి సంఘం ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. ప్రజావాణిలో వచ్చిన అనేక ముఖ్యమైన సమస్యలు ఏమిటో వాటిని ఎలా పిరష్కరించారో చెప్పలేరు. రాజగోపాల రెడ్డికి మంత్రి పదవి కావాలి. ఆయన జీవిత ధ్యేయం అదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌లో డ్రామాలు నడుస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ దశదిశా లేకుండా వ్యవహరించింది. కెసిఆర్‌ను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మలేదు. అందుకే అధికారం లోకి రావడానికి తొమ్మిదిన్నరేళ్లు పట్టింది. ఇది కూడా కాంగ్రెస్ పార్టీని చూసి ఓటేయలేదు. కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల అవినీతి కార్యక్రమాలతో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. ఈ విషయం కాంగ్రెస్‌కు అర్థం కావడం లేదు. నిజానికి కాంగ్రెస్‌లో బలమైన నేతగా ఎదిగిన అవకాశం ఉమ్మడి ఎపిలో ఒక్క రాజశేఖర్ రెడ్డికే సొంతం. ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లు పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి బలమైన నాయకుడిగా ఎదగలేక పోయారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆ పార్టీ సంస్కృతిలో భాగమని ఊరుకోక తప్పదు. ఎందుకంటే కొండాసురేఖ,చిన్నారెడ్డిలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం కాంగ్రెస్ నేతలు చేయరు. నిజంగానే వీరిద్దరిని పీకి అవతల పడేస్తే కాంగ్రెస్‌లో చురుకు పుడుతుంది. కాంగ్రెస్ బలం పెరుగుతుంది. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య పార్టీని వీడితే ఏమయ్యింది. వీరు పోయినా ఏమీ కాదు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ కొంత మంది కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. అంతర్గత కుమ్ములాటలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఏవగింపు ఏర్పడింది. బిఆర్సను మించి పాలన సాగిస్తారని అనుకుంటే మంత్రులంతా పర్సంటేజీల ఖాతాలు తెరిచారు. గ్రామస్థాయిలో అవినీతి మరింత పెరిగింది. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు ఎక్కుపెట్టడం భరిస్తూ పోతే వీరి జాబితా పెరగడమే తప్ప తగ్గదని గురించాలి. రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కిక్కురుమనకుండా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం తలలు ఎగరేస్తున్నారు. ఈ ఇద్దరు నేతు ఏ పార్టీలోకైనా వెళ్లి రాగలరని ఇప్పటికే రుజువయ్యింది. బిఆర్ఎస్ పాలనను నిలదీస్తూ...ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దీటుగా ఎదుర్కొనే సత్తా రేవంత్‌రెడ్డికి మాత్రమే ఉందన్న నమ్మకంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. అదే సమయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తొలగించడం రేవంత్‌రెడ్డికి కలిసొచ్చింది. కేసీఆర్ పోకడల పట్ల విముఖంగా ఉన్న ప్రజలు ప్రత్యామ్నాయ నాయకుడిగా రేవంత్‌రెడ్డిని ఎంచుకున్నారే తప్ప కాంగ్రెస్‌పైనో లేదా రాహుల్‌పైనో ప్రేమతో కాదు. కేసీఆర్‌కు ప్రత్యామ్నాయం ఎవరన్న ప్రశ్న ఉదయించినప్పుడు, తాను ఉన్నానన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడంలో రేవంత్‌రెడ్డి విజయం సాధించడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. అధికారం దక్కాక ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో మంత్రులదీ పెద్ద పాత్రే ఉంది. అయితే పాత కాంగ్రెస్ సంస్కృతిని మరవకపోవడంతో పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పింది. వీరివల్ల ఎన్నుకున్న ప్రజలకు రాష్ట్ర ప్రజలకు ఉపయోగం లేదన్న ప్రచారం బాగా వ్యాప్తి చెందుతున్న వేళ కొండా సురేఖ లాంటి వారి చర్యలు కాంగ్రెస్‌కు బలహీనతే తప్ప బలం కాదు. వీరిని వదిలించుకుంటే తప్ప మేలు జరగదు. కాంగ్రెస్ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# నల్గొండ జిల్లా ను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం





**గంజాయి ముఠాపై నల్లగొండ పోలీసుల ఉక్కుపాదం.**

**దేవరకొండ ఆగస్టు 28 ( మహాప్రభ )**
గంజాయి సేవించిన.. విక్రయించిన, ఎంతటి వాడైన ఉపేక్షించేది లేదు.. పీడీ యాక్ట్‌కు సిద్ధం: డిఎస్పి శివరాం రెడ్డి తెలిపారు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో నల్లగొండ జిల్లా ను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే ప్రధాన లక్ష్యం.డి ఎస్పి శివరాం రెడ్డి అన్నారు గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు చేసిన టూ టౌన్ పోలీసులు.

ఐదుగురు నిందితుల అరెస్ట్, మరో నిందితుడు పరారీ.. ఒరిస్సా నుంచి నల్లగొండకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసుల గుర్తించారు రూ.25 వేల విలువైన 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న మని తెలిపారు దొంగతనానికి గురైన 4 మోటార్ సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు రికవరీ అని తెలిపారు గంజాయి కొనుగోలు కోసం దొంగిలించిన బైక్‌ను ఒరిస్సాలో కుదువ పెట్టినట్లు విచారణలో వెల్లడైందన్నారు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో 20 గ్రాముల ప్యాకెట్‌ను రూ.500కు విక్రయించినట్లు పోలీసుల తెలిపారు నల్లగొండలోని హనుమాన్‌నగర్, గాంధీనగర్, కామేశ్వర్‌రావు కాలనీలో బైక్ చోరీలు. హైదరాబాద్ వనస్థలిపురంలోనూ దొంగతనం చేశారని తెలిపారునిందితుల్లో పలువురిపై గతంలోనే గంజాయి,దొంగతనం, ఇతర కేసులు ఉన్నాయని అన్నారు పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయి పంచుకుంటుండగా పట్టుకున్న టూ టౌన్ పోలీసులు తెలిపారు.

నల్లగొండ డి.ఎస్పీ కే. శివరాం రెడ్డి పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించామని వివరించారు ×× టౌన్ సి.ఐ కే. అది రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దాడులు నిర్వహించామని తెలిపారు.
ఎస్.ఐ. డి. సైదా బాబు, ఎస్.ఐ.అహ్మద్ షరీఫ్, సిబ్బంది లావూరి బాలకోటి, మహమ్మద్ షకీల్‌కు ఎస్స్ పి.అభినందనలు తెలిపారు 'మిషన్ పరివర్తన్'లో భాగంగా గంజాయి సేవించే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. గంజాయి సేవించినా.. అమ్మినా కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక.. యువత గంజాయి మత్తుకు బానిస కాకుండా కట్టడి చేసేందుకు పోలీసుల స్పెషల్ ఫోకస్.. గంజాయి పై 112, లేదా స్థానిక పోలీస్ స్టేషన్ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం గా ఉంచబడతాయి...

# చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ.

**రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులకు రాఖీ కట్టిన సోదరి.**



**మెదక్ జిల్లా -28ఆగస్ట్ (మహాప్రభ ).**
రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులు విధుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తుండగా ఓ సోదరి పోలీసులకు రాఖీ కట్టి అభిమానం చాటుకున్నారు. సమాజంలో పోలీసుల పాత్ర పెద్దన్న వంటిదని ఆమె పేర్కొన్నారు. మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర పనులకు వెళ్తున్నారని, వారు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకమే కారణమని అన్నారు.చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ అంటూ పోలీసులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. పండగ రోజు కూడా కుటుంబాలకు దూరంగా విధుల్లో ఉంటూ ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బంది కూడా సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు రాఖీ కట్టడం ద్వారా పోలీసులపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ఆత్మీయ అనుబంధం మరోసారి చాటిచెప్పినట్లయింది.

# గూడెం వారింట రాఖీ పండుగ సందడి


**--ఎమ్మెల్యే జిఎంఆర్‌కు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపిన సోదరీమణులు**



**పటాన్చెరు ఆగస్టు 28, (మహాప్రభ)** .
సోదర సోదరీమణుల మధ్య ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కుటుంబంలో ఘనంగా జరిగాయి. రాఖీ పండుగను పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండుగ సంబరాలు జరుపుకున్నారు.
ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరీమణులు నర్సమ్మ, సువర్ణ ఆయనతో పాటు మరో సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కుమార్తె కొలన్ రాజేశ్వరి రెడ్డి తన సోదరుడు గూడెం విక్రం రెడ్డికి రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటుకున్నారు.
కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి కుమార్తె రుధిర, గూడెం విక్రం రెడ్డి కుమార్తె మహిరలు తమ సోదరులు అక్షయ్ రెడ్డి, నిహాన్ రెడ్డిలకు రాఖీలు కట్టారు. దీంతో గూడెం కుటుంబంలో రాఖీ పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. అక్కా చెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ప్రేమానురాగాలకు రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# మన్నెంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వైభవంగా శ్రావణ పౌర్ణమి కల్యాణోత్సవం


**-వేదమంత్రాలు.. సన్నాయి నాదాలు.. భక్తుల ఆధ్యాత్మిక సందడి**



**మన్నెంకొండ: దేవరకద్ర ఆగస్టు 28 మహా ప్రభ**
మహబూబ్‌నగర్ జిల్లా మన్నెంకొండలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ స్వామివారిని, అమ్మవార్లను పల్లె లక్ష్మి సేవలో వేదమంత్రోచ్ఛారణల నడుమ, మంగళవాయిద్యాలు, సన్నాయి నాదాలతో ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చారు. అనంతరం లక్ష్మీ విలాసంలో ఆధ్యాత్మిక వాతావరణం మధ్య స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నాదాలతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో మార్మోగాయి. స్వామివారి కల్యాణాన్ని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతూ స్వామివారి కృపాకటాక్షాలు తమపై ప్రసరించాలని ప్రార్థించారు. ఈ పవిత్ర కల్యాణోత్సవంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్, అలహరి రామకృష్ణ, ఆలయ ఈవో శ్రీనివాస రాజు తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ కల్యాణోత్సవంతో మన్నెంకొండ క్షేత్రం భక్తి శోభతో కళకళలాడింది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని దర్శించుకున్న భక్తులు "గోవిందా.. గోవిందా" అంటూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో స్మరించారు.

# ఆడపడుచుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**
**-ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కట్టిన శ్రావణి**





**ఆత్మకూర్ ఆగస్టు 28, (మహాప్రభ)**
రాఖీ పండుగ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గారి కుమార్తె శ్రావణి శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను వారి నివాసంలో కలిసి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని ఆడపడుచులందరికీ అన్నగా అండగా నిలుస్తూ, వారి భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రాఖీ పండుగ సోదర--సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక అని, ఆడపడుచుల గౌరవం, భద్రత, సంక్షేమం కోసం నిరంతరం పనిచేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా అండగా నిలుస్తున్నామని తెలిపారు. మహిళలు, యువతులు విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఆడపడుచులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబం సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాఖీ కట్టిన శ్రావణికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆశీస్సులు అందించి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# తూప్రాన్ సుష్మా హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స


**-45 ఏళ్ల గిరిజన మహిళ కడుపులో 5 కిలోల కణితి తొలగింపు..**

**-రక్తహీనతతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా విజయవంతంగా ఆపరేషన్**









**తూప్రాన్, ఆగస్టు 28,(మహాప్రభ)**
తీవ్రమైన కడుపునొప్పి, నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో కొంతకాలంగా బాధపడుతున్న ఓ గిరిజన మహిళకు తూప్రాన్‌లోని సుష్మా హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి కడుపులో ఉన్న భారీ కణితిని విజయవంతంగా తొలగించారు. సుమారు 5 కిలోల బరువున్న కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించడంతో బాధితురాలు ప్రస్తుతం కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.
సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లి తండాకు చెందిన అజ్మీరా రమేష్ భార్య అజ్మీరా సజ్జి (45) గత కొంతకాలంగా నెలసరి సమయంలో అధిక రక్తస్రావంతో పాటు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. క్రమంగా ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించారు.

**స్కానింగ్‌లో బయటపడిన భారీ కణితి**

ఈ నెల ఆగస్టు 21న స్కానింగ్ నిర్వహించగా, సజ్జి కడుపులో సుమారు 5 కిలోల బరువున్న భారీ కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. కణితి కారణంగా ఆమెకు నెలసరి సమయంలో అధిక రక్తస్రావం జరుగుతుండటంతో శరీరంలో రక్తం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ఆమె హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 6 గ్రాములకు పడిపోయింది.
తీవ్రమైన రక్తహీనత కారణంగా ఆమె ఎంతో నీరసంగా ఉండటంతో పాటు కళ్లుతిరగడం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితిని అత్యవసరంగా పరిగణించిన వైద్య బృందం ముందుగా అవసరమైన వైద్య చర్యలు చేపట్టి బి పాజిటివ్ గ్రూపు రక్తాన్ని ఎక్కించి శస్త్రచికిత్సకు సిద్ధం చేసింది.

**నిష్ణాతులైన వైద్యుల ఆధ్వర్యంలో ఆపరేషన్**

స్కానింగ్ రిపోర్టులను నిశితంగా పరిశీలించిన అనంతరం ఆగస్టు 22న సుష్మా హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. కడుపులో ఇంత భారీ కణితి ఉండటాన్ని గుర్తించి, రోగి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచి, నిపుణుల బృందంతో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగికి మెరుగైన వైద్యం అందించగలిగామని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

**సకాలంలో వైద్య పరీక్షలు అవసరం**

నెలసరి సమయంలో అధిక రక్తస్రావం, తరచూ కడుపునొప్పి, నీరసం, తల తిరగడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా శరీరంలో ఏర్పడే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తూప్రాన్‌లోని సుష్మా హాస్పిటల్‌లో నిష్ణాతులైన వైద్య బృందం ఆధ్వర్యంలో 5 కిలోల భారీ కణితిని విజయవంతంగా తొలగించడంతో రోగి కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గైనకాలజిస్ట్
సర్జన్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్, డాక్టర్ శ్రవణ్ కుమార్, అనస్తీషియా వైద్యులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ ప్రదీప్ సింహ, డాక్టర్ సుష్మాదేవి నేతృత్వంలో వైద్య బృందం ఎంతో జాగ్రత్తగా శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న సుమారు 5 కిలోల కణితిని విజయవంతంగా తొలగించింది. తీవ్రమైన రక్తహీనతతో ఉన్న రోగికి శస్త్రచికిత్స నిర్వహించడం వైద్య బృందానికి సవాల్‌గా ఉన్నప్పటికీ, ముందస్తు వైద్య ఏర్పాట్లు, నిపుణుల పర్యవేక్షణతో ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది.

**వైద్యుల సమన్వయంతో విజయవంతమైన చికిత్స**

ఈ ప్రత్యేక శస్త్రచికిత్స విజయవంతం కావడంలో వైద్యులతో పాటు ఆసుపత్రి సిబ్బంది సమన్వయం కీలకంగా నిలిచింది. 28వ తేదీ శుక్రవారం ఉదయం పేషెంట్ ఆరోగ్యంగా ఉండటం తో డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ ప్రదీప్ సింహ తెలిపారు. శస్త్రచికిత్స సమయంలో స్టాఫ్ లక్ష్మి, ఆర్. సునీత, సందీప్, సుమన్, నవీన్, రజనీకాంత్ తదితరులు వైద్య బృందానికి సహకరించారు.

# ఎల్లారెడ్డి పద్మశాలి సంఘం రాఖీ పౌర్ణమి వేడుకలు

**-యజ్ఞం నిర్వహించి జంధ్యాలు ధరించిన సభ్యులు..**

**-కులబాంధవులకు రాఖీలు కట్టిన మహిళా కమిటీ**



**ఎల్లారెడ్డి, ఆగస్టు 28, (మహాప్రభ)**
రాఖీ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ పద్మశాలి సంఘ భవనంలో అధ్యక్షుడు విద్య రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైదిక పురోహితులు దయానందం, హనుమాన్లు, నాగరాజు గౌడ్, సంతోషిని ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించి జంధ్యాలు ధరించారు.
అనంతరం మహిళా కమిటీ అధ్యక్షురాలు నామ విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి తమ్మల లాస్య ఆధ్వర్యంలో పద్మశాలి కులబాంధవులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సభ్యులు పరస్పరం రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ కాశీరాం, కోశాధికారి గూడ రామకృష్ణ, ఉపాధ్యక్షులు షేర్ల సోమేశ్వర్, తమ్మల శ్యాంసుందర్, ఎల్లారెడ్డి మండల పద్మశాలి అధ్యక్షుడు పద్మ పండరి, ప్రధాన కార్యదర్శి షేర్ల ప్రభుతో పాటు సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు, పెద్దమనుషులు, కులబాంధవులు పాల్గొన్నారు. వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో సంఘ భవనంలో పండుగ వాతావరణం నెలకొంది.

# గిరిజన బాలికల వసతి గృహంలో రక్షాబంధన్




**దేవరకొండ ఆగస్టు 28 ( మహాప్రభ )**
ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ, "ఆడపిల్లను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం" అనే నినాదంతో బాలికల విద్య, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాలికల అభివృద్ధి, భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సహకరించాలని, విద్యార్థినులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. అదేవిధంగా బాలికలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంటారని అన్నారు. వివక్షత లేని సమాజం కోసం సమానత్వం నెలకొల్పాలని అన్నారు. విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు ఏన్నుపోతుల పరమేష్, ఎడ్ల చలపతి, అనూష, సరస్వతి, మంజుల, స్వాతిఅనురాధ తదితరులు

# రక్షాబంధన్ శుభాకాంక్షలు

**- ఎమ్మెల్యే బాలు నాయక్**



**దేవరకొండ ఆగస్టు 28 ( మహాప్రభ )**
పవిత్రమైన రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్)సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర నమ్మకానికి ప్రతీకలిగా జరుపుకునే పవిత్రమైన పండుగ అని అన్నారు. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి, అతని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను కోరుకోవడం, సోదరుడు తన సోదరికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. రాఖీ అనేది కేవలం ఒక దారపు ముడి కాదని, సోదరసోదరీమణుల మధ్య జీవితాంతం కొనసాగే అనుబంధం, బాధ్యత, ప్రేమకు ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాల నుంచి జీవితంలోని ప్రతి అడుగులో అక్కాచెల్లెళ్లకు, అన్నదమ్ములకు ఒకరికొకరు తోడుగా నిలిచే బంధమే రాఖీ పండుగ స్ఫూర్తి అని అన్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లను గౌరవిస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని, సోదరీమణులు తమ సోదరుల అభివృద్ధి, ఆయురారోగ్యాల కోసం ఆకాంక్షించాలని కోరారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు ప్రేమ, ఐక్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయనిఅన్నారు.
రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, ఆత్మీయత, సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం ఎల్లప్పుడూ చిరస్థాయిగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆకాంక్షించారు.


# హైదరాబాదులో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ ఆగస్టు 28 ( మహాప్రభ )**
దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నోముల రవీందర్ హైదరాబాద్ హస్తినాపురంలోని ఆరుష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆసుపత్రికి వెళ్లి రవీందర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిండి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్తను కూడా ఎమ్మెల్యే బాలు నాయక్ పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ వైద్యులతో మాట్లాడి, ఇద్దరికీ మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన చికిత్సను అందించి త్వరగా కోలుకునేలా చూడాలని సూచించారు. వారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి తమ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్యకు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.
కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు

# శ్రీ మార్కండేయ మందిరంలో జంధ్యాల పౌర్ణమి వేడుకలు

**నూతన యజ్ఞోపవీతాలు ధరించిన పద్మశాలి సంఘ సభ్యులు**



**గాంధారి: ఆగస్టు 28 (మహాప్రభ)**
మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని జంధ్యాల పౌర్ణమి వేడుకలు పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తులు సామూహికంగా జంధ్యాలు మార్చుకున్నారు. పాత జంధ్యాలను తొలగించి, ఆచార ప్రకారం నూతన జంధ్యాలను ధరించి మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గుంటుకు అశోక్, పట్టణ సంఘ అధ్యక్షుడు క్యాతం కృష్ణ, ఉపాధ్యక్షుడు సామల రాజు, ప్రధాన కార్యదర్శి సామల విజయ్, కోశాధికారి తాటిపాముల శివ, సలహాదారులు సంతోష్, ప్రభు, నారాయణ, శ్రీహరి, శ్రీనివాస్, గంగ కిషన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నలకు రాఖీ కట్టిన చెల్లి.....



**తూప్రాన్, 28 ఆగష్టు,(మహాప్రభ)**
మెదక్ జిల్లాతూప్రాన్ పట్టణంలో రక్షాబంధన్ పండుగ ఘనంగా జరుపుకున్నారు రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని సోదరులకు రాఖీలు కట్టి సోదరీమణులు ఎశీతగానో మురిసిపోయారు, అక్క తమ్ముళ్లు అన్నాచెల్లెళ్ల ప్రేమను రాగాలకు రక్షణ కవచం రాఖీ పండుగ, రాఖీ పౌర్ణమి రోజున సోదరి తన సోదరూడి క్షేమాన్ని సంతోషాన్ని కోరుకుంటూ రాఖీ కట్టడం ఆమెకు ఎల్లప్పుడు అండగా ఉంటానని సోదరుడు భరోసా ఇవ్వడమే ఈ పండుగ విశిష్టత అన్నారు, ఎంతో ప్రేమతో సోదరులకు ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెలివిర్యాలని సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధం మరింత పటిష్టం కావాలని ఆకాంక్షించారు.

# గాంధారి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సర్కిల్ ఇన్ స్పెక్టర్ చౌదరి వీరయ్య

**-కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**




**గాంధారి: ఆగస్ట్ 28 (మహాప్రభ)**
నూతనంగా వచ్చిన సదాశివనగర్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ చౌదరి వీరయ్య గాంధారి పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ, రవి, ప్రకాష్, కానిస్టేబుల్, కు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసులు, ఫిర్యాదులను తొందరగా పూర్తి చేయాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం లేకుండా పని చేయాలని సూచించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరాఖీ కట్టిన కాంగ్రెస్ నాయకురాలు కుంజా కవిత





**హైదరాబాద్ ఆగస్టు 28,(మహాప్రభ)**
ఈరోజు రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏ.రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ లోని వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కుంజా బిక్షం కుమార్తె కుంజా కవిత ముఖ్యమంత్రికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి తో ఆత్మీయంగా పలకరించుకున్నారు.

# బీఆర్ఎస్ మైనార్టీ యువ నాయకుడు అడ్డుకు ఘన సన్మానం



**దేవరకద్ర: ఆగస్టు 28 మహాప్రభ**
దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ యువ నాయకుడు అడ్డు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ జట్టి నరసింహారెడ్డి అడ్డును శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా అడ్డుకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులో నూతన కారును ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ దంపతులు





**దేవరకొండ ఆగస్టు 28 ( మహాప్రభ )** చందంపేట మండలం, చీత్రియాల కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కాకునూరి రంగయ్య గౌడ్ నూతనంగా కారు కొనుగోలు చేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నివాసం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ , వారి సతీమణి జ్యోతి ప్రసన్న కలిసి నూతన కారుకు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రంగయ్య గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన వాహనంతో సుఖసంతోషాలతో ప్రయాణాలు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రంగయ్య గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

## 10 ఏళ్ళకు సోదరుడికి రాఖీ కట్టిన సోదరీమణులు.....


**-రక్షాబంధన్ రాఖీ ఆత్మీయత రక్షణ కవచం.....**



**తూప్రాన్,ఆగస్టు 28, (మహాప్రభ)**
అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు, రక్షణకు రాఖీ పౌర్ణమి ప్రతీక అని సోదరి తన సోదరుడి క్షేమాన్ని, సంతోషాన్ని కోరుకుంటూ రాఖీ కట్టడం, ఆమెకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని సోదరుడు భరోసా ఇవ్వడమే ఈ పండుగ విశిష్టత అని తెలిపారు.రక్షాబంధన్ సందర్భంగా తూప్రాన్ లో రాఖీ పండుగ జరుపుకోవాలని కెనడా నుంచి ఇండియా వచ్చిన దంతేపల్లి నాగరాజు నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంతో ప్రేమతో అన్నయ్యకి రాఖీలు కట్టడానికి వచ్చిన సోదరీమణులు ఆయనకు ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీలు కట్టిన మహిళలందరికీ ఆయన స్వయంగా చీరలను బహుమతిగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సోదర సోదరీమణుల మధ్య అనుబంధం మరింత పటిష్టం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దంతేపల్లి కుటుంబ సభ్యులు నవీన్, జాముని, లక్షణ, సోదరీమణులు ప్రణతి ప్రవీణ్ , జ్యోతి ప్రశాంత్,స్వాతి, స్రవంతి, శిరీష, లత, శ్రావణి,శివ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డు జన్మదిన వేడుకలు..

**- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు**





**దేవరకద్ర: ఆగస్టు 28 మహాప్రభ**
దేవరకద్ర మున్సిపల్ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు అడ్డు జన్మదినం సందర్భంగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే శ్రీ ఆల వెంకటేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడ్డు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం బీఆర్ఎస్ మండల పార్టీ కార్యకర్తలు కూడా మాజీ ఎమ్మెల్యేను కలిసి అడ్డు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అడ్డును శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, మండల పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ మూడ డైరెక్టర్ కర్ణం రాజు అడ్డుని శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూతురు ఆలా ప్రీతి రెడ్డి కొండల్ సత్యం సాగర్ కురుమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రామాయంపేట బస్టాండ్‌లో రాఖీ పౌర్ణమి సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు

**మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు - ఎస్సై బాలరాజు**



**రామాయంపేట, ఆగస్టు 28 (మహాప్రభ)**
రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా రామాయంపేట బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామాయంపేట ఎస్సై బాలరాజు నేతృత్వంలో పోలీసు సిబ్బంది బస్టాండ్‌లో మోహరించి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపట్టారు. బస్టాండ్‌లో మైక్ ఏర్పాటు చేసి మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, తమ వెంట తెచ్చుకున్న బ్యాగులు, విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని ప్రయాణికులకు సూచనలు ఇచ్చారు.

## ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి రాఖీ కట్టిన మహిళా కార్యకర్తలు




**దేవరకద్ర: ఆగస్టు 28 మహాప్రభ**
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకద్ర నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డిని కలిసి సోదర భావంతో రాఖీలు కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సోదరుడు జి. భాస్కర్ రెడ్డికి కూడా మహిళా కార్యకర్తలు రాఖీలు కట్టి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోదర--సోదరీమణుల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మహిళా కార్యకర్తల ఆత్మీయతకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జి. భాస్కర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రక్షాబంధన్ పర్వదినం ప్రతి కుటుంబంలో సంతోషం, సోదరభావం, ఆత్మీయతను నింపాలని ఆకాంక్షించారు.

# రక్షాబంధన్--రాఖీ పండుగ





**-ప్రాధాన్యత, చారిత్రక నేపథ్యం, అన్నాచెల్లెళ్ల అనుబంధం, నేటి సమాజంలో దాని ప్రాముఖ్యత**

**-రాఖీ పండుగ.. అనుబంధాల మధుర బంధం**

**-అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్.. ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలకు ప్రతిరూపం**






రక్షాబంధన్.. అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే అపురూపమైన పండుగ. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు ఇంటిల్లిపాదీ సందడిగా మారుతుంది. సోదరీమణులు తమ సోదరుల చేతికి ప్రేమతో రాఖీ కట్టి, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలుస్తామని, కష్టసుఖాల్లో తోడుంటామని భరోసా ఇస్తూ కానుకలు అందిస్తారు. అందుకే రాఖీని కేవలం ఒక పండుగగా కాకుండా ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు ప్రతీకగా భావిస్తారు.

**రాఖీ అంటే.. రక్షణకు ప్రతీక**

'రాఖీ' అనే పదానికి రక్షణ అనే అర్థం ఉంది. సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టడం ద్వారా అతని శ్రేయస్సును కోరుతుంది. సోదరుడు కూడా తన సోదరికి జీవితాంతం అండగా ఉంటాననే భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఈ బంధంలో రక్తసంబంధం మాత్రమే కాకుండా పరస్పర విశ్వాసం, ప్రేమ, బాధ్యతలు దాగి ఉంటాయి. చిన్నతనంలో ఒకరితో ఒకరు గొడవపడే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు.. పెరిగే కొద్దీ ఒకరికొకరు ఆపన్నహస్తంగా మారుతారు. బాల్యంలో కలిసి ఆడుకున్న జ్ఞాపకాలు, పంచుకున్న సరదాలు, చిన్నచిన్న గొడవలు, తల్లిదండ్రుల మందలింపులు.. ఇలా ఎన్నో మధుర జ్ఞాపకాలను రాఖీ పండుగ మరోసారి గుర్తుచేస్తుంది.

**పుట్టింటి జ్ఞాపకాలను గుర్తుచేసే పండుగ**

వివాహం అనంతరం ఆడపిల్లలు తమ అత్తవారింటికి వెళ్లిన తర్వాత పుట్టింటితో అనుబంధం మరింత ప్రత్యేకంగా మారుతుంది. రాఖీ పండుగ సందర్భంగా సోదరి పుట్టింటికి రావడం, అన్న లేదా తమ్ముడికి రాఖీ కట్టడం కుటుంబంలో ఆనందాన్ని నింపుతుంది. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులు, సోదరీమణులు ఈ పండుగ కోసం ప్రత్యేకంగా ప్రయాణాలు చేస్తుంటారు. కొంతమంది సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు పోస్టు ద్వారా పంపుతుంటే.. మరికొందరు కొరియర్, ఆన్‌లైన్ మార్గాల్లో రాఖీలు పంపుతున్నారు. విదేశాల్లో ఉన్నవారికి కూడా రాఖీలు పంపుతూ బంధాన్ని కొనసాగిస్తున్నారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా రాఖీ పండుగలోని ఆత్మీయత మాత్రం మారడం లేదు.

**రాఖీ కట్టే వేళ ప్రత్యేకత**

రక్షాబంధన్ రోజున సోదరీమణులు సోదరులకు హారతి ఇచ్చి, నుదుటన తిలకం దిద్ది, మిఠాయి తినిపించి రాఖీ కడతారు. అనంతరం సోదరులు సోదరీమణులకు బహుమతులు అందిస్తారు. కొందరు నగదు, వస్త్రాలు, ఆభరణాలు, ఇతర కానుకలు అందజేస్తే.. మరికొందరు తమ సోదరీమణుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక బహుమతులు ఇస్తారు. అయితే రాఖీ పండుగలో బహుమతుల కంటే బంధానికి ఇచ్చే విలువే ముఖ్యమైనది. సోదరుడు ఎంత ఖరీదైన బహుమతి ఇచ్చాడన్నది కాదు.. సోదరి జీవితంలో కష్టసమయంలో తనకు అండగా నిలిచే వ్యక్తి ఉన్నాడనే నమ్మకమే ఈ పండుగ అసలు సందేశం.

**చారిత్రక నేపథ్యం**

రక్షాబంధన్‌కు భారతీయ సంస్కృతిలో ఎంతో పురాతనమైన ప్రాధాన్యత ఉందని చెబుతారు. చరిత్ర, పురాణాల్లో రక్షాసూత్రానికి సంబంధించిన అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. శ్రీకృష్ణుడికి ద్రౌపది రక్షాసూత్రం కట్టిన కథను కూడా రాఖీతో అనుబంధంగా పలువురు గుర్తుచేసుకుంటారు. అలాగే రాజులు, సైనికులు, ప్రజల మధ్య రక్షణకు ప్రతీకగా రక్షాసూత్రాన్ని ఉపయోగించిన సందర్భాలు కూడా చరిత్రలో కనిపిస్తాయి. అయితే రాఖీ పండుగకు సంబంధించిన ఆచారాలు, కథనాలు ప్రాంతాన్నిబట్టి భిన్నంగా కనిపిస్తాయి. కాలానుగుణంగా పండుగ నిర్వహణలో మార్పులు వచ్చినా.. దాని ప్రధాన ఉద్దేశం మాత్రం బంధాలను గౌరవించడం, పరస్పరం అండగా నిలవడంగానే కొనసాగుతోంది.

**కాలంతో మారుతున్న రాఖీ**

ఒకప్పుడు సాధారణమైన దారంతో తయారు చేసిన రాఖీలే ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం మార్కెట్‌లో అనేక రకాల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల కోసం కార్టూన్ బొమ్మలతో కూడిన రాఖీలు, యువత కోసం ఆకర్షణీయమైన డిజైన్లతో రాఖీలు, మహిళలు ఇష్టపడే విధంగా ప్రత్యేకంగా తయారు చేసిన రాఖీలు, పర్యావరణహిత రాఖీలు ఇలా వివిధ రకాల రాఖీలు మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరగడంతో దేశంలోని ఏ ప్రాంతంలో ఉన్నా తమ సోదరులకు నచ్చిన రాఖీని ఇంటి నుంచే ఎంపిక చేసి పంపే అవకాశం ఏర్పడింది. దీంతో పండుగకు మరింత ప్రత్యేకత చేకూరుతోంది.

**కుటుంబ బంధాలకు బలం**

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కుటుంబ సభ్యుల మధ్య కలిసిమెలిసి గడిపే సమయం తగ్గుతోంది. ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాలు, ఇతర కారణాలతో సోదరులు, సోదరీమణులు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ పండుగ కుటుంబ సభ్యులను ఒక్కచోటికి చేర్చే అవకాశాన్ని కల్పిస్తోంది. రాఖీ సందర్భంగా పుట్టింటికి వచ్చే సోదరీమణులతో ఇళ్లు సందడిగా మారుతాయి. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులు ఆనందంగా గడుపుతారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం మరింత బలపడుతుంది.

**సోదరుడికే కాదు.. సోదరికి కూడా అండ**

రాఖీ పండుగలో 'రక్షణ' అనే భావనను కేవలం సోదరుడు సోదరిని రక్షించడానికే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. నేటి సమాజంలో సోదరుడు, సోదరి ఇద్దరూ ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. కుటుంబంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు పరస్పరం ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు సహాయం చేయడం, జీవితంలో ముందుకు సాగేందుకు ప్రోత్సహించడం నిజమైన రక్షాబంధన్ స్ఫూర్తి.

ప్రస్తుత కాలంలో మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, రాజకీయాలు, క్రీడలు, విజ్ఞానం తదితర రంగాల్లో ముందుకు సాగుతున్నారు. వారికి సోదరులు ప్రోత్సాహం అందించడం, వారి నిర్ణయాలను గౌరవించడం కూడా రక్షాబంధన్ ఇచ్చే సందేశంలో భాగమే.

**పండుగ వెనుక సామాజిక సందేశం**

రాఖీ పండుగ కుటుంబ సంబంధాలకే పరిమితం కాకుండా సమాజానికి కూడా ఒక మంచి సందేశాన్ని అందిస్తుంది. ఒకరినొకరు గౌరవించడం, కష్టాల్లో తోడుగా నిలవడం, బలహీనులకు అండగా ఉండటం, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి విలువలను రక్షాబంధన్ గుర్తుచేస్తుంది.

సోదరి చేతికి కట్టిన రాఖీని చూసిన ప్రతి సోదరుడు తన బాధ్యతను గుర్తు చేసుకోవాలి. అదే విధంగా సోదరుడి చేతికి రాఖీ కట్టే ప్రతి సోదరి ప్రేమ, ఆప్యాయతతో కుటుంబ బంధాలను మరింత బలపర్చాలనే సంకల్పం చేసుకోవాలి.

**ప్రేమకు చిరునామా.. రాఖీ**

రాఖీ పండుగలో కనిపించేది ఒక చిన్న దారం మాత్రమే. కానీ ఆ దారంలో దాగి ఉన్న భావోద్వేగం ఎంతో గొప్పది. చిన్నతనంలో కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్లను, అక్కాతమ్ముళ్లను జీవితాంతం ఒకే బంధంతో కలిపి ఉంచే మధుర జ్ఞాపకం రాఖీ.

సోదరి చేతులతో సోదరుడి మణికట్టుకు రాఖీ కట్టే ఆ క్షణం ఎంతో ప్రత్యేకమైనది. ఆ సమయంలో ఇద్దరి మనసుల్లోనూ చిన్ననాటి జ్ఞాపకాలు మెదులుతాయి. ఎన్ని సంవత్సరాలు గడిచినా, ఎన్ని దూరాలు పెరిగినా, ఎన్ని బాధ్యతలు వచ్చినా.. ఆ అనుబంధం మాత్రం చెరిగిపోదు.

**రాఖీ దారం పలుచనైనదే.. కానీ దాని బంధం ఎంతో బలమైనది.**

అందుకే రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమను పంచుతూ, బంధాలను బలోపేతం చేస్తూ, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి కొత్త అర్థాన్ని అందిస్తోంది. సోదరుడు--సోదరి ఒకరికొకరు అండగా నిలుస్తూ జీవితంలో సుఖసంతోషాలతో ముందుకు సాగాలని కోరుకునే పవిత్రమైన రోజుగా రాఖీ పండుగకు భారతీయ సంస్కృతిలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది.

ఇట్లు
మీ, పుల్గం అఖిల్ రెడ్డి

# బిజినెస్

## లాభాల్లో ముగిసిన సూచీలు.. పుంజుకున్న ఐటీ షేర్లు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాలతో ముగిసింది. ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచే సూచీలు సానుకూలంగా కదలడంతో ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడంతో మార్కెట్ మరింత బలపడింది. ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ రెండూ లాభాల్లో స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 77,264.51 వద్ద ముగిసింది. రోజంతా సూచీ 76,988.22 పాయింట్ల కనిష్ఠ స్థాయి నుంచి 77,357.97 పాయింట్ల గరిష్ఠ స్థాయి వరకు కదలాడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 84 పాయింట్లు పెరిగి 24,175.65 వద్ద స్థిరపడింది. మార్కెట్ ప్రారంభం నుంచి చివరి వరకు కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సూచీలు సానుకూలంగా ముగిశాయి. ముఖ్యంగా ఐటీ రంగ షేర్లు మార్కెట్ లాభాలకు ప్రధాన కారణంగా నిలిచాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ తదితర ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీంతో ఐటీ సూచీ కూడా మెరుగైన పనితీరు కనబరిచింది. ఇతర కీలక రంగాల షేర్లలోనూ మిశ్రమ ధోరణి కనిపించినప్పటికీ, ఐటీ స్టాక్స్ ఇచ్చిన మద్దతుతో ప్రధాన సూచీలు లాభాలను కొనసాగించాయి. ఇటీవలి ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు కనిపించినప్పటికీ శుక్రవారం మార్కెట్ పాజిటివ్‌గా ముగియడం ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. వారాంతపు ట్రేడింగ్ రోజున కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్ లాభాల్లో స్థిరపడింది. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయి మారకం విలువ, కంపెనీల పనితీరు వంటి అంశాలు దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

హైదరాబాద్:
బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. వరుసగా పెరుగుతూ వచ్చిన పసిడి ధరలకు ఒక్కసారిగా బ్రేక్ పడటంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,160 తగ్గి రూ.1,59,820కి చేరింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర కూడా భారీగా తగ్గింది. రూ.2,900 పతనంతో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,500కు చేరింది. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి శుక్రవారం ధరల తగ్గుదల కొంత ఊరటనిచ్చింది. మరోవైపు వెండి ధర కూడా భారీగా దిగివచ్చింది. కిలో వెండి ధర ఏకంగా రూ.5,000 తగ్గడంతో రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. ఒకేరోజు బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గడంతో బులియన్ మార్కెట్‌లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది. అయితే అంతర్జాతీయ



మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం విలువ, పెట్టుబడిదారుల కొనుగోళ్లు, దేశీయ డిమాండ్ వంటి అంశాల ఆధారంగా బంగారం, వెండి ధరల్లో రోజువారీ మార్పులు చోటుచేసుకుంటాయి. అలాగే తెలుగు రాష్ట్రాల్లో నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. కొనుగోలు చేసే సమయంలో స్థానిక బులియన్ మార్కెట్ ధరలను పరిశీలించడం మంచిది.

## యమహా వైజెడ్ఎఫ్-ఆర్2 మోటర్‌సైకిల్..

### - ప్రారంభ ధర రూ.2.30 లక్షలు

న్యూఢిల్లీ,
ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ యమహా మోటర్..దేశీయ మార్కెట్లోకి వైజెడ్ఎఫ్-ఆర్2 స్పోర్ట్స్ బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బైకు ప్రారంభ ధర రూ.2.30 లక్షలుగా నిర్ణయించింది. దీంట్లో వైజెడ్ఎఫ్-ఆర్2 ధర రూ.2,30,500గాను, మరో రకం రూ.2,39,500గాను, ఎం రకం రూ.2.53 లక్షలకు విక్రయిస్తున్నది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.204 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో తయారైన ఈ బైకు మూడు రకాల్లో, ఐదు కలర్స్‌లో లభించనున్నది. వచ్చే నెల చివరి నుంచి బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు అందచేయనున్నట్టు తెలిపింది.



# స్పోర్ట్స్

## నిప్పులు చెరిగిన ఆర్చర్, రాబిన్సన్..
## లార్డ్స్ టెస్టులో 110కే పాకిస్థాన్ ఆలౌట్..!


లార్డ్స్‌లో జరుగుతున్న రెండో టెస్టులోనూ పాకిస్థాన్ బ్యాటర్లు తేలిపోయారు. ఇంగ్లండ్ పేసర్లు ఓలీ రాబిన్సన్(4-11), జోఫ్రా ఆర్చర్(3-26)లు నిప్పులు చెరగడంతో రెండో రోజు పాక్ ఆటగాళ్లు క్రీజులో నిలవలేకపోయారు. ఓపెనర్ అజాన్ అవైస్(46)కు సహకరించే వాళ్లు కరువయ్యారు. చివరి బ్యాటర్ అబ్బాస్(3)ను ఆర్చర్ ఔట్ చేయడంతో 110 పరుగలకే ఆ జట్టు ఆలౌటైంది. వెంటనే అంపైర్లు టీ బ్రేక్ ప్రటించగా.. సమిష్టి వైఫల్యం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు వెనుకంజలో ఉంది పాక్.తొలి టెస్టులో భారీ విజయంతో జోరుమీదున్న ఇంగ్లండ్ లార్డ్స్‌లోనూ పట్టుబిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 290కే ఆలౌటైన ఆతిథ్య జట్టుకు బౌలర్లు మంచి ఆధిక్యాన్ని అందించారు. దాంతో, ఆతిథ్య జట్టును మూడొందలలోపే కట్టడి చేశామని సంబురపడిన పాక్ సంతోషం ఆవిరైంది. ఓపెనర్ షాన్ మసూద్(1) వికెట్‌తో ఇంగ్లండ్‌కు జోఫ్రా ఆర్చర్(3-26) తొలి బ్రేకివ్వగా.. ఆపై ఓలీ రాబిన్సన్(4-11) వికెట్ల వేటతో భయపెట్టాడు.మరో ఎండ్‌లో జోష్ టంగ్(2-27) సైతం విజృంభించి



ఫామ్‌లోలేని బాబర్ ఆజాం(8)ను వెనక్కి పంపాడు. అంతే.. 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. కష్టాల్లో పడిన పాక్‌ను రాబిన్సన్, ఆర్చర్ మరింత దెబ్బతీయగా.. తర్వాతి ఆటగాళ్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఓపెనర్ అజాన్ అవైస్(46) మినహా క్రీజునంటుకొని పోరాడే బ్యాటర్ కరువవ్వడంతో పాక్ ఇన్నింగ్స్ 110 వద్ద ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 180 పరుగులు వెనకబడింది. పాక్ కుప్పకూలడంతో ఇంగ్లండ్ టీ బ్రేక్ అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలెట్టనుంది.

## కోహ్లీకి రాఖీ కట్టిన సోదరి..

### -'నా ప్రార్థనలు ఎల్లప్పుడు మిమ్మల్ని కనుగొంటాయ'ని పోస్ట్..!



భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ రాఖీ పండుగను సంబురంగా చేసుకున్నాడు. రక్షా బంధన్ సందర్భంగా తోబుట్టువు భావన(దీప్తుఃఘుఃఘు) అతడికి రాఖీ కట్టి మురిసిపోయింది. సోదరుడికి రాఖీ కట్టిన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఆమె ఆసక్తికర క్యాప్షన్ రాసింది. 'నా ప్రార్థనలు ఎల్లప్పుడూ మిమ్మల్ని కనుగొంటాయి' అంటూ భావన పెట్టిన పోస్ట్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధం గొప్పతనానికి అద్దం పడుతోంది.రక్షా బంధన్ వేళ తోబుట్టువు చేత్తో రాఖీ కట్టించుకున్నారు పలువురు సెలబ్రిటీలు. భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ సైతం సోదరి భావనతో రాఖీ కట్టించుకున్నాడు. విరాట్ అన్నయ్య వికాస్‌కు సైతం ఆమె రాఖీ కట్టింది. అనంతరం సోదరులతో తన అనుబంధం.. రాఖీ విశిష్టతను ప్రతిబించేలా సోషల్‌మీడియాలో ఆసక్తికర పోస్ట్ పెట్టింది భావన.జీవితం మనల్ని ఎంత దూరం తీసుకెళ్లినా.. నా ప్రార్థనలు ఎల్లప్పుడూ మిమ్మల్ని కనుగొంటాయి' అంటూ ఆమె కోహ్లీ, వికాస్‌లకు రాఖీ కట్టిన ఫొటోలను పంచుకుంది. ఆమె క్యాప్షన్ చదివినవాళ్లంతా 'అవును.. మన సోదరులు ఎక్కడున్నా రక్షా బంధన్ మనల్ని ఒక్కటి చేస్తుంది' అంటూ కామెంట్లు పెడుతున్నారు. లండన్‌ను తన రెండో ఇంటిగా మార్చుకున్న కోహ్లీ.. భార్య అనుష్క శర్మ, పిల్లలతో పాటు భారత్‌కు వచ్చి రాఖీ కట్టించుకున్నాడని నెట్టింట పోస్టులు వైరలవుతున్నాయి. ఇంగ్లండ్‌పై వన్డే సిరీస్‌లో మెరిసిన విరాట్.. సెప్టెంబర్‌లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్న విషయం తెలిసిందే.

## డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం

శ్రీలంకతో రెండో టెస్ట్ డ్రా చేసుకున్న టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరడం చాలా కష్టమని వెటరన్ బ్యాటర్ హనుమ విహారి అన్నాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌ను భారత్ గెలిచి ఉంటే డబ్ల్యూటీసీ అవకాశాలు ఇంకాస్త మెరుగ్గా ఉండేవని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్ట్‌ను టీమిండియా చేజేతులా డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమిని తప్పించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన హనుమ విహారి.. శ్రీలంక పోరాట పటిమను ప్రత్యేకంగా కొనియాడాడు. ఈ సిరీస్‌ను భారత్ గెలిచినా.. శ్రీలంక మనసులను గెలిచిందని చెప్పుకొచ్చాడు. 'అద్భుతమైన పోరాటంతో శ్రీలంక మనుసులను గెలిచింది. సోనాల్ దినుషా అద్భుతంగా బ్యాటిగ్ చేశాడు. తన ఫస్ట్ క్లాస్ అనుభవం చూపించాడు. స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్‌తో భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు చేశాడు. క్వాలిటి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో అలా ఆడాడు. శ్రీలంక దిగ్గజాలైన కుమార సంగక్కర, మహేళ జయవర్దనే, సనత్ జయసూర్య వంటి దిగ్గజ ఆటగాళ్ల తరహాలో సోనాల్ దినుషా గొప్ప ఆటగాడిగా ఎదుగుతాడు.



భారత్ విషయానికి వస్తే.. టాస్ గెలవడం కలిసొచ్చింది. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో మూడో స్థానాన్ని భర్తీ చేశాడు. ఐపీఎల్, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించాడు. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ కూడా బాగా ఆడారు. ధ్రువ్ జురెల్ కూడా అద్భుతంగా ఆడాడు. టాప్-5లో ఆడే సామర్థ్యం తనకు ఉందని నిరూపించుకున్నాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా హాఫ్ సెంచరీతో పర్వాలేదనిపించాడు. యశస్వి జైస్వాల్ వైఫల్యమే ఆందోళనకు గురిచేసే విషయం. అతను మినహా బ్యాటింగ్ ఆర్డర్ మొత్తం అదరగొట్టింది. గత సిరీస్‌లతో పోల్చితే స్పిన్‌ను అద్భుతంగా ఆడింది. బౌలింగ్ విషయానికి వస్తే.. సిరాజ్ కాస్త అలసిపోయినట్లు కనిపించాడు. అతనికి ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి ఇచ్చి గుర్నూర్ బ్రార్‌ను ఆడించాల్సిందేమో. కుల్దీప్ యాదవ్ ఆడించినా బాగుండేది. సారాన్ష్ జైన్ వికెట్లు తీసినా.. అతని బౌలింగ్ శైలి శ్రీలంక పిచ్‌లకు సూటవ్వదు. చాలా స్లోగా బౌలింగ్ చేస్తాడు. దాంతో శ్రీలంక బ్యాటర్లు ఈజీగా స్వీప్ షాట్స్ ఆడారు. మానవ్ సుతార్ మాత్రం అదరగొట్టాడు. జడేజాకు పర్‌ఫెక్ట్ రిప్లేస్‌మెంట్ అతను. ఎలాంటి కండిషన్స్‌లోనైనా బౌలింగ్ చేయగలడు. ప్రసిధ్ కృష్ణ కూడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు.ఈ సిరీస్‌ను భారత్ 2-0తో గెలవాల్సింది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం. 2-0తో గెలిస్తే పరిస్థితి మెరుగ్గా ఉండేది. భారత్ ఇంకా 7 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. అందులో 6 గెలవాలి. న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా రెండు టెస్ట్‌లు గెలవాలంటే అద్భుతం జరగాలి. ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై ఐదు టెస్ట్‌ల్లో విజయం సాధించాలి. ప్రాక్టికల్‌గా ఇది అసాధ్యం.'అని హనుమ విహారి అభిప్రాయపడ్డాడు.



రకుల్ ప్రీత్ రాఖీ స్పెషల్... వైట్ అండ్ వైట్‌లో రాజహంసలా!

# దూసుకుపోతున్న ఇరుముడి


## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టిక్కెట్ల అమ్మకం

మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.




# నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# మళ్లీ లవ్ బ్రేకప్

## -బాయ్‌ఫ్రెండ్ వాకర్ బ్లాంకోకి గుడ్ బై చెప్పిన అనన్య పాండే

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే వ్యక్తిగత జీవితం మరోసారి బీ-టౌన్‌లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు వార్తల్లో నిలిచిన ఆమె, తన ప్రియుడు వాకర్ బ్లాంకోతో విడిపోయినట్లు జాతీయ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దాదాపు రెండేళ్లుగా వీరి రిలేషన్ కొనసాగగా, తాజాగా ముగింపు పలికారనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అనన్య పాండే లేదా వాకర్ బ్లాంకో ఈ బ్రేకప్ వార్తలపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. కాగా, 2024 మధ్యలో జరిగిన అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ వివాహ వేడుకల సందర్భంగా అనన్య పాండే, వాకర్ బ్లాంకో మధ్య పరిచయం ఏర్పడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారిందని బీ-టౌన్ వర్గాల్లో ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో కనిపించడం, సోషల్ మీడియాలో ఒకరికొకరు ప్రత్యేకంగా స్పందించడం వంటి అంశాలు వారి రిలేషన్‌షిప్‌పై మరింత చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వాకర్ పేరుకు సంబంధించిన లాకెట్‌ను అనన్య ధరించినట్లు వచ్చిన వార్తలు కూడా అప్పట్లో వైరల్ అయ్యాయి. అయితే తమ ప్రేమ గురించి అనన్య, వాకర్ ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా అధికారిక ప్రకటన చేయలేదు. ఇప్పుడు విడిపోయారనే వార్తలు రావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఇద్దరి మధ్య వచ్చిన కొన్ని విభేదాల కారణంగా ఈ బంధానికి ముగింపు పలికారనే ప్రచారం సాగుతోంది. అయితే ఎలాంటి పెద్ద గొడవలు లేకుండా, పరస్పర అంగీకారంతోనే స్నేహపూర్వకంగా వేర్వేరు మార్గాలను ఎంచుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఈ వార్తలపై అధికారిక ధృవీకరణ లేనందున, ప్రస్తుతం ఇవన్నీ మీడియా వర్గాల్లో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది. వాకర్ బ్లాంకోకు ముందు అనన్య పాండే పేరు బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్‌తోను బలంగా వినిపించిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు చాలాకాలం బాలీవుడ్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అనంతరం ఆ బంధానికి కూడా ముగింపు పలికారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు వాకర్ బ్లాంకోతోనూ బ్రేకప్ వార్తలు రావడంతో అనన్య వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. రు.



# 18న వస్తోన్న అనుమాన పక్షి

డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.




# గొప్పవాళ్లంతా సింగిల్సే..

## -ప్రతి సక్సెస్‌ఫుల్ వ్యక్తి వెనుక మహిళ ఉండదు: ఆర్జీవీ సంచలన పోస్ట్

టాలీవుడ్‌లో కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రాంగోపాల్ వర్మ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. నిత్యం ఏదో ఒక అంశంపై తనదైన శైలిలో స్పందించే ఆర్జీవీ.. తాజాగా సింగిల్స్ గురించి చేసిన వ్యాఖ్యలు నెటిజన్ల మధ్య ఆసక్తికర చర్చకు దారితీశాయి. సాధారణంగా ప్రతి విజయవంతమైన పురుషుడి వెనుక ఒక మహిళ ఉంటుంది అనే మాటను తరచూ వింటుంటాం. అయితే ఈ మాటతో తాను ఏకీభవించనన్నట్లుగా ఆర్జీవీ తన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించిన అనేక మంది ప్రముఖులు సింగిల్స్‌గా ఉన్నారంటూ ఆసక్తికరమైన పేర్లను ప్రస్తావించారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, టాటా, బాటా, ఏపీజే అబ్దుల్ కలాం, సల్మాన్ ఖాన్, రాహుల్, యోగి, బాబా రాందేవ్ వంటి ప్రముఖులను ఉదాహరణగా చెబుతూ.. ప్రతి సక్సెస్‌ఫుల్ పురుషుడి వెనుక మహిళ ఉండాల్సిన అవసరం లేదు. గొప్పవాళ్లు సింగిల్స్‌గా కూడా గొప్ప విజయాలు సాధించగలరు అనే అర్థంలో ఆర్జీవీ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరు ఆర్జీవీ అభిప్రాయంతో ఏకీభవిస్తుండగా, మరికొందరు మాత్రం ఆయన వ్యాఖ్యలను సరదాగా తీసుకుంటూ సెటైర్లు వేస్తున్నారు. "ఈ గొప్పవాళ్ల జాబితాలో మీరు ఎక్కడ ఉన్నారు?" అంటూ కొందరు నెటిజన్లు ఆర్జీవీని ఫన్నీగా ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు ఆయనపై తమదైన శైలిలో కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా.. ఎప్పటిలాగే ఆర్జీవీ చేసిన ఒక్క పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకే కారణమైంది. సింగిల్‌గా ఉండటం, వివాహం చేసుకోవడం వ్యక్తిగత ఎంపిక అని.. విజయానికి వాటితో సంబంధం లేదని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం "ప్రతి విజయానికి వెనుక కుటుంబం, స్నేహితులు, సహచరుల మద్దతు కూడా కీలకమే" అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి తన వివాదాస్పద, విభిన్న ఆలోచనలతో మరోసారి నెటిజన్లను చర్చకు లాగిన రాంగోపాల్ వర్మ.. ఈసారి "సింగిల్సే గ్రేట్" అంటూ చేసిన కామెంట్లతో వార్తల్లో నిలిచారు.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com